



# ప్రజాదర్బార్

తెలుగు దినపత్రిక


## వరంగల్ జిల్లా అనుబంధం

సోమవారం 14 సెప్టెంబర్ 2026 | పేజీలు : 4


# చెట్టు పడినా..

## అధికారుల్లో చలనం లేదు!

- గుంతల రహదారిలో అడ్డంగా విరిగిన చెట్టు..
- వాహనదారులకు నరకయాతన




**శాయంపేట ప్రజాదర్బార్ సెప్టెంబర్ 13:**

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మాందారిపేట–శాయంపేట ప్రధాన రహదారిపై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం రంగయ్యకుంట సమీపంలో భారీ వృక్షం విరిగి రోడ్డుకు అడ్డంగా పడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గంటలు గడుస్తున్నా చెట్టును తొలగించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకపోవడం పై స్థానికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై చెట్టు అడ్డంగా పడిన విషయం తెలిసినా అధికారులు స్పందించకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నా పట్టించుకోకపోవడంపై మండిపడుతున్నారు. ఇదే రహదారి ఇప్పటికే గుంతలమయంగా మారి అధ్వానంగా తయారైంది. వర్షపు నీరు గుంతల్లో చేరడంతో వాటి లోతు కనిపించక వాహనదారులు ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తోందని చెబుతున్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలిరోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును వెంటనే తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే గుంతలమయమైన రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టి వాహనదారుల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.




# వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా జరుపుకోవాలి: కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ ప్రతినిధి ప్రజాదర్బార్ సెప్టెంబర్ 13:**



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వరంగల్ జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు.విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని, ఆకాంక్షించారు. వినాయక చవితి పండుగ ను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కలెక్టర్ కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజించడం ద్వారా పర్యావరణానికి మేలు చేకూరుతుందని తెలిపారు.పర్యావరణానికి హాని కలిగించే విగ్రహాలు, రసాయనిక రంగుల వినియోగాన్ని నివారించాలని సూచించారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో జిల్లాలో రైతులు పండించిన పంటలు సమృద్ధిగా పండి, పంటల సాగు అనుకూలంగా కొనసాగి రైతులు సుభిక్షంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో, పరస్పర సహకారంతో నిర్వహించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. భక్తి భావంతో, హిందూ సంప్రదాయాలకు అనుగుణంగా పండుగను నిర్వహిస్తూ సమాజంలో సోదరభావం, ఐక్యతను చాటాలని కోరారు. పండుగ సందర్భంగా ప్రజలు నిబంధనలు పాటిస్తూ శాంతియుతంగా వేడుకలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# విఘ్నాలు లేకుండా ప్రజల కార్యాలు సఫలం కావాలి

- జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేసిన హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ ప్రజాదర్బార్ సెప్టెంబర్ 13**

విఘ్నాలను తొలగించి సకల శుభాలను ప్రసాదించే విఘ్నేశ్వరుని అనుగ్రహంతో జిల్లా ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తూ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించి పూజించాలని కోరారు. సోమవారం వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు శుభాకాంక్షలను జిల్లా కలెక్టర్ తెలిపారు.



## భక్తి భావంతో శాంతియుత వాతావరణంలో వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలి

**- మట్టి గణపతుల ఏర్పాటుతో పర్యావరణ పరిరక్షణకు చేయూతనివ్వాలి: జిడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న**

వరంగల్ ప్రజాదర్బార్ సెప్టెంబర్ 13:

విఘ్నేశ్వరుని ఆశీస్సులతో నగర ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని జిడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా వరంగల్ మహా నగర ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, మీడియా ప్రతినిధులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో,ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, రసాయనిక రంగులు, పర్యావరణానికి హాని కలిగించే విగ్రహాలను నివారించి మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజించాలని సూచించారు. పండుగ వేడుకలను పరస్పర సహకారంతో,ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ శాంతియుతంగా నిర్వహించి నగరంలో సోదరభావం, ఐక్యతను చాటాలని



కమిషనర్ పిలుపునిచ్చారు.

# ఇళ్ల మధ్యల సెల్ టవర్ పెట్టవద్దని ఆందోళన

**- ప్రజల వ్యతిరేకతతో మట్టేవాడలో ఆగిపోయిన ఎయిర్టెల్ సెల్ టవర్ పనులు**

మట్టేవాడ ప్రజాదర్బార్ సెప్టెంబర్13:

సెల్ టవర్ వల్ల తమకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేయడంతో ఎయిర్టెల్ సంస్థకు చెందిన సెల్ టవర్ పనులు తాత్కాలికంగా నిలిపివేసారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 29డివిజన్ రఘునాథ్ కాలనీలో ప్రైవేటు సంస్థ అయినటు వంటి ఎయిర్టెల్ టవర్ ఇండ్ల మధ్యలో వేయడాన్ని స్థానిక ప్రజలు అడ్డుకున్నారు. తమ ఆరోగ్యంతో చెలగాటం ఆడే ఇటువంటి పనులను సహించేది లేదని పెద్ద ఎత్తున గుమికూడి ఆందోళన చేయడంతో పాటు మట్టేవాడ పోలీసులకు చరవాణి ద్వారా ఫిర్యాదు చేశారూ. ఫిర్యాదు అందుకున్న నేపథ్యంలో సంఘటన స్థలానికి చేరుకున్న మట్టేవాడ సబ్ ఇన్స్పెక్టర్ ప్రజలకు నచ్చని పని చేయకూడదని ప్రైవేటు సంస్థ అయినా భారతి ఎయిర్టెల్ మొబైల్ ప్రతినిధులకు చెప్పి పనులను మధ్యలో ఆపి వేయించారు. దీంతో స్థానిక ప్రజలు సెల్ టవర్ నిర్మాణ పనులు ఆగిపోవడంతో తమ ఆందోళనను



ఉపసంహరించుకున్నారు. ఎయిర్టెల్ టవర్ ఉండకూ దదని సెల్ టవర్ వల్ల రేడియేషన్ పెరిగి అనారోగ్య పరిస్థితులు తలెత్తుతాయని జనావాసాల మధ్య ఎట్టి పరిస్థితుల్లో సెల్ టవర్ నిర్మాణాన్ని చేపట్ట నీయమని ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మీడియా ప్రతినిధులకు తెలియజేశారు. రఘునాథ్ కాలనీ ప్రజలకు మద్దతుగా స్థానిక రాజకీయ నాయకులు సదాంత్ కొడకండ్ల, మామ నూరి రాజు, గాలయ్య, ఇజగిరి భీమరాజ్, శివకుమార్, రాజు, ప్రమోద్, రాజేందర్‌లు పాల్గొన్నారు.

## డా. మల్లాది శ్రీరామ్ రెడ్డి ని సన్మానించిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**- జీవిత సాఫల్య పురస్కారం అందుకున్న ప్రముఖ శిశువైద్యుడు మల్లాది శ్రీరామ్ రెడ్డి.**

హన్మకొండ ప్రజాదర్బార్ సెప్టెంబర్13:

వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ప్రముఖ శిశువైద్యులు శ్రీ డా. మల్లాది శ్రీరామ్ రెడ్డి ఐదు రాష్ట్రాల నుంచి ఎంపికై ఎమినెంట్ పీడియాట్రిషన్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్న సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఆదివారం ఆయనను ప్రత్యేకంగా సన్మానించి ఘనంగా సత్కరించారు. చిన్నారులకు విశిష్ట వైద్య




సేవలు అందిస్తూ, వైద్య రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన డా మల్లాది శ్రీరామ్ రెడ్డిని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అభినందించారు. ఐదు రాష్ట్రాల నుంచి ఎంపికై జీవిత సాఫల్య పురస్కారం అందుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ఆయన అందిస్తున్న సేవలు అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అధికారులు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిన్న వర్షానికే చెరువులుగా పరకాల రోడ్లు..

**- మున్సిపాలిటీ పనితీరు పై ప్రజల ఆగ్రహం**




పరకాల ప్రజాదర్బార్ సెప్టెంబర్ 13:

పట్టణంలో కొద్దిపాటి వర్షం కురిసినా ప్రధాన రహదారులు జలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా భూపాలపల్లి రోడ్డులో చిన్న వర్షానికే భారీగా నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. రహదారుల పై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి, వర్షపు నీరు సులభంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం ఎందుకు చూపడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పట్టణం అభివృద్ధి దిశగా ముందుకు సాగాల్సిన సమయంలో పారిశుద్ధ్యం,డ్రైనేజీ, రహదారుల నిర్వహణపై నిర్లక్ష్యం కనిపిస్తోందని వారు ఆరోపిస్తున్నారు.చిన్న వర్షానికే రోడ్లు చెరువులను తలపిస్తుండడంతో పట్టణ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.పలుచోట్ల చెత్త పేరుకుపోవడం, మురుగు నీరు నిలిచిపోవడం వంటి సమస్యలు కూడా ప్రజలకు ఇబ్బందిగా మారుతున్నాయని చెబుతున్నారు. సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, తాత్కాలిక చర్యలకు పరిమితం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి భూపాలపల్లి రోడ్డుతో పాటు పట్టణంలోని నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## పరకాలలో వైభవంగా “సాంప్రదాయ” ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభం

పరకాల ప్రజాదర్బార్ సెప్టెంబర్ 13:



పరకాల పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన “సాంప్రదాయ” ఫ్యామిలీ రెస్టారెంట్ ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. మున్సిపల్ 14వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి కొక్కిరాల దీప్తి-రాకేష్ రావు దంపతులు ఈ రెస్టారెంట్ ను నూతనంగా ప్రారంభించారు. వారి ఆహ్వానం మేరకు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ గారు ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించేందుకు ఇలాంటి ఆధునిక రెస్టారెంట్లు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. నూతన రెస్టారెంట్ నిర్వాహకులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కొయ్యాడ శ్రీనివాస్, బండి శ్రీధర్, గూడెల్లి సదన్న, అల్లె దశరథం, సుధమల్ల రమేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఒంటేరు శ్రావణ్ కుమార్, సమన్వయ కమిటీ సభ్యులు బొచ్చు సాల్మన్, బొచ్చు జాన్సన్, చందుపట్ల రాఘవరెడ్డి, అలాగే లడే శ్రీకాంత్, ఎండి అలీ తదితర ప్రముఖులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# మట్టి గణపతులు మాటలవరకే

**- పర్యావరణం కోసం పరకాలలో కానరానీ మట్టి గణనాథుల పంపిణీ..!**

**- పట్టింపు లేని పర్యావరణ శాఖ.**

పరకాల ప్రజాదర్బార్ సెప్టెంబర్13:

మట్టి గణపతులను ప్రతిష్టించి పర్యావరణాన్ని కాపాడాలని చెప్పే ప్రజాప్రతినిధులు స్వచ్ఛంద సంస్థలు మాటలకే తప్ప చేతల్లో కనిపించలేదనేది పరకాల పట్టణంలో కనిపిస్తుంది. ప్రజలకు మట్టి గణనాథులను పంపిణీ చేసి ఆచరించాలని చెప్పడంలో పర్యావరణ పరిరక్షణకు నడుము కట్టి పెద్ద పెద్ద ఉపన్యాసాలు చెప్పే గణపాటీలు ప్రజలకు మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేయడంలో ఈ సంవత్సరం వెనుకంజ వేశారు. మట్టి గణపతులనే ప్రతిష్ఠించాలని గతంలో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, హిందుత్వ అభిమానులు విస్తృతంగా ప్రచారం చేసినప్పటికీ,ఈ ఏడాది పరకాల పట్టణంలో ఆచరణలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. మట్టి వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన చోట రంగురంగుల విగ్రహాలకే అధిక ప్రాధాన్యం లభించడం వాటి ధరలను సామాన్యులు భరించకపోవడం బాధాకరంగా మారింది.మట్టి గణపతులను మాత్రమే వినియోగించాలని ప్రజలకు అవగాహన కల్పించాల్సిన స్వచ్ఛంద సంస్థలు, నిర్వాహకులు ఈ విషయంపై పెద్దగా దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.




**పర్యావరణ శాఖకు పట్టింపు లేదు..!**

పర్యావరణ పరిరక్షణ పై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ప్రజలకు ఉచితంగా మట్టి గణనాధులను పంచి పర్యావరణానికి మేలు చేయవలసిన పర్యావరణ శాఖ అధికారులు పరకాల పట్టణంలో మట్టి గణనాధులను పంపిణీ చేయడంలో విఫలం అయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వినాయక చవితి సమీపిస్తున్న సందర్భంలో రసాయనాలతో తయారు చేసే వినాయక విగ్రహాల తయారీ వల్ల పర్యావరణానికి కలిగే నష్టాన్ని పర్యావరణ శాఖ అధికారులు పట్టణంలో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ ఈ సంవత్సరం వారి ప్రచారం కానరాకుండా పోయింది. గత సంవత్సరంలో ప్రచారం ఓ మోస్తరుగా చేసిన ఈ సంవత్సరం ప్రచారం ఏమైందని పలువురు భక్తులు ప్రశ్నిస్తున్నారు.

**పర్యావరణానికి దగ్గరగా ఉందాలి..**

మరోవైపు,పరకాల పట్టణంలోని పలు గణపతి మండపాల వద్ద భక్తి గీతాలు,శ్లోకాలు వినిపించాల్సిన చోట వెక్కిలి చేష్టలకు దారితీసే చిల్లర పాటలకు యువత ప్రాధాన్యం ఇయ్యడం పై నగరవాసులు ఆవేదన చెందుతున్నారు. వినాయకుడి ఆరాధన అంటే ప్రకృతిని ఆరాధించటం అనే విషయాన్ని ప్రస్తుత యువత మరచిపోతున్నారని ప్రకృతి కన్నెర్ర చేస్తే నేపాల్లో ఏమైందో యువత గుర్తు చేసు కోవాలని హితవు పలుకుతున్నారు. ఎంతో భక్తిశ్రద్ధలతో పూజించే వినాయకుడి సన్నిధిలో అసభ్యకరమైన లేదా భక్తిభావానికి విరుద్ధమైన పాటలు వినిపించడం సరికాదని భక్తులు అభిప్రాయ పడుతున్నారు. వినాయక మండపాల్లో భక్తి వాతావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత నిర్వాహకులు, పూజారులు,స్వచ్ఛంద సంస్థలు, యువత పై ఉందని పలువురు సూచిస్తున్నారు.మట్టి వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించడం తో పాటు, మండపాల్లో భక్తి గీతాలు,శ్లోకాలు మాత్రమే వినిపించేలా చర్యలు తీసుకోవాలని భక్తులు,పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

# క్యాడర్‌తో కొండ...! ముందు రోజులు మనవే అంటూ ధీమా....!







**- మంత్రి పదవి కోల్పోయిన తర్వాత తూర్పు నాయకులతో మాజీ మంత్రి కొండ సురేఖ భేటీ.**

**- మంత్రి పదవి పోవడం బాధగా లేదు..**

**- రాహుల్ గాంధీని ప్రధాని చేసే వరకు కాంగ్రెస్ లోనే**

**- నాయిని బసవరాజ్ సరయ్యలకు గట్టిగా కౌంటర్**

వరంగల్ ప్రతినిధి ప్రజాదర్బార్ సెప్టెంబర్ 13:

కాంగ్రెస్ నాయకురాలు మాజీ మంత్రి కొండ సురేఖ ఆదివారం వరంగల్ తూర్పు కాంగ్రెస్ క్యాడర్ తో ప్రత్యక్షంగా భేటీ అయ్యారు. కాంగ్రెస్ అధిష్టానం కొండ సురేఖను మంత్రి పదవి నుండి తొలగించిన పది రోజుల తదనంతరం కొండ సురేఖ ఆమె భర్త మాజీ ఎమ్మెల్సీ కొండ మురళీధర్ రావు తో కలిసి నియోజకవర్గం లోని ఎంకే నాయుడు హోటల్లో కార్యకర్తలతో కొండ అభిమానులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ భేటీ తూర్పు కాంగ్రెస్ లో రాజకీయ వేడిని రగిలించినట్లయింది. ఈ సందర్భంగా కొండ సురేఖ మాట్లాడుతూ తన కూతురు మాట్లాడిన మాటలకు తనను బాధ్యురాలిని చేసి మంత్రి పదవి నుండి ఉద్వాసన పలకడమే తనను బాధించిందని అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీని వీడేది లేదని రాహుల్ గాంధీని ప్రధాని మంత్రిని చేసే వరకు కాంగ్రెస్ లోనే ఉంటానని ఆమె చెప్పారు. ఐ కమాండ్ ఆదేశాల మేరకు నడుచుకుంటానని రాబోయే రోజులు మనవే అని కార్యకర్తలకు సూచించారు. తన జీవితంలో ఏనాడు పదవుల కోసం ప్రాకులాడలేదని కొందరు సొంత పార్టీలో ఉన్న నాయకుల వలె పగలు ఒక పార్టీ రాత్రి ఒక పార్టీ మారలేదు అని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేస్తానని రాబోయే మున్సిపల్ ఎన్నికలలో 24 మంది కాంగ్రెస్ కార్పొరేటర్ లను గెలిపించుకునే బాధ్యత తన పైన ఉందని మనమందరం కలిసి ముందుకు వెళ్లాలని చెప్పారు.

**నాయిని రాజేందర్ రెడ్డి బసవరాజ్ సారయ్యలకు సవాల్..**

మాజీ మంత్రి కొండ సురేఖ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్రెడ్డి ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య లకు గట్టిగా సవాల్ విసిరారు. ఎప్పుడు మైకు దొరకనట్టుగా మైకు దొరకగానే ఈ ఇద్దరూ నాయకులు ఊగిపోతున్నారని ఇది మంచిది కాదని అన్నారు. దమ్ముంటే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి కార్పోరేటర్ గా గెలవాలని బసవరాజు సారయ్యకు సవాల్ విసిరారు. కొండ దంపతులు ఏనాడు పదవుల కోసం వెంపర్లాడలేదని ప్రజల కోసమే పనిచేసామని రోజుకో పార్టీ పూటకో పార్టీ మారలేదని అవాకులు చివాకులు పేలితే మంచిగా ఉండదని గట్టిగా హెచ్చరించారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నేనా కాంగ్రెస్ పార్టీని వీడేది లేదని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పైన తమకు అపారమైన నమ్మకం ఉందని కొండ దంపతులు ప్రజలకు ఏం చేశారు అనే విషయం అధిష్టానం దృష్టిలో ఉన్నదని ఎక్కువ తక్కువ మాట్లాడే నాయకులు వారి వారి హద్దుల్లో ఉంటే మంచిదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ మీసాల ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపాల నవీన్ రాజ్, వివిధ డివిజన్ల మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ డివిజన్ల అధ్యక్షులు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్థిక స్వేచ్ఛ కాదు. అభివృద్ధికి నిధులివ్వండి



ప్రజాదర్బార్ సెప్టెంబర్ 13 :

నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న గ్రామ పంచాయతీలు మల్టీపర్పస్ వర్కర్లతోనే పాలన నెట్టుకొస్తున్న పరిస్థితి డీజిల్ లేక మూలకు చేరుతున్న ట్రాక్టర్లు నిలిచిపోతున్న పారిశుద్ధ్య పనులు అప్పులు చేసి అభివృద్ధి పనులు చేస్తున్నామంటున్న సర్పంచులు గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ గ్రామాల అభివృద్ధికి కీలకమైన గ్రామ పంచాయతీలు నిధుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని,గ్రామాల్లో పారిశుధ్యం,తాగునీరు,వీధి దీపాలు, చెత్త సేకరణ,ఇతర కనీస సౌకర్యాల నిర్వహణకు సరిపడా నిధులు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అశ్వాపురం మండలంలోని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం గ్రామ పంచాయతీ లకు ఆర్థిక స్వేచ్ఛ అంటూ ఇటీవల అసెంబ్లీ లో చెపుతున్నారని,ఆర్థికంగా గ్రామ పంచాయతీ లో నిధులే లేవని,ఇంకా స్వేచ్ఛ ఎక్కడిదని వారు ప్రశ్నించారు.ఆదివారం అశ్వాపురం లోని తెలంగాణా భవన్‌లో బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం పంచాయతీలకు ప్రధానంగా వస్తున్న ఇంటి పన్నుల ఆదాయం,గ్రామ నిర్వహణకు ఏమాత్రం సరిపోవడం లేదని,ఆ ఆదాయం మల్టీపర్పస్ వర్కర్ల జీతాలకే పూర్తిగా సరిపోని పరిస్థితి ఉందని, కొత్తగా సిబ్బందిని నియమించి గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను విస్తరించాలంటే నిధులు అందుబాటులో లేవని వారు వాపోయారు.గ్రామాల్లో ప్రతిరోజూ చెత్త సేకరణ,పారిశుధ్య పనులకు ఉపయోగించే ట్రాక్టర్లకు డీజిల్ ఖర్చులు కూడా పంచాయతీలకు భారంగా మారుతున్నాయని ,డీజిల్ కోసం నిధులు లేకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో ట్రాక్టర్లు సైతం మూలకు చేరుతున్నాయని,ఫలితంగా చెత్త సేకరణ,పారిశుధ్య కార్యక్రమాలు ప్రభావితమవుతున్నాయని, లక్షల రూపాయల ప్రజాధనం వ్యయంతో గ్రామ పంచాయతీ ప్రజల ఆస్తిగా గత ప్రభుత్వంలో నిర్మించిన పల్లె ప్రకృతి వనాలు,డంపింగ్ షెడ్లు,క్రీడా ప్రాంగణాలు,వైకుంఠ ధామాల్లో నిధుల లేమితో సంరక్షణ చర్యలు చేపట్టలేక అన్యాక్రాంతం అయ్యే పరిస్థితి గ్రామ పంచాయతీ లలో దాపురించిందన్నారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కనీస అభివృద్ధి పనులు చేపట్టాల్సి వస్తున్నప్పటికీ పంచాయతీల ఖాతాల్లో నిధులు లేకపోవడంతో అప్పులు చేసి పనులు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో ప్రజల నుంచి వచ్చే డిమాండ్లను తీర్చాలేక నిధుల కోసం ఎదురుచూడాలా అన్న పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామ పంచాయతీలను బలోపేతం చేయాలంటే కేవలం పన్నుల ఆదాయంపై ఆధారపడే పరిస్థితికి ముగింపు పలకాలని, గ్రామాల జనాభా, విస్తీర్ణం, అవసరాలను పరిగణనలోకి తీసుకుని పంచాయతీలకు ప్రత్యేక అభివృద్ధి నిధులు కేటాయించాలని, ఆర్థిక స్వేచ్ఛ పేరుతో పంచాయతీల పై బాధ్యతలు పెంచడం కాకుండా ఆ బాధ్యతలను నిర్వర్తించేందుకు అవసరమైన నిధులు కూడా ప్రభుత్వం సమకూర్చాలన్నారు.

# ఈఎన్‌టీ సమస్యలకు ఉచిత వైద్య సేవలు

– శాయంపేట మండలం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
– సెప్టెంబరు 15 నుంచి 19 వరకు అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్‌లో శిబిరం

శాయంపేట ప్రజాదర్బార్ సెప్టెంబర్ 13 :

ఈఎన్‌టీ సమస్యలతో బాధపడుతున్న వారికి అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు ఉచిత ఈఎన్‌టీ శస్త్రచికిత్స మెగా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఈ అవకాశాన్ని శాయంపేట మండల ప్రజలు వినియోగించుకోవాలని ఆసుపత్రి యాజమాన్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రముఖ ఈఎన్‌టీ శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ ఆర్. శ్రవణ్‌కుమార్ (ఎంబీబీఎస్, ఎంఎస్–ఈఎన్‌టీ) ఆధ్వర్యంలో సెప్టెంబరు 15 నుంచి 19వ తేదీ వరకు శిబిరం కొనసాగనుంది. చెవినొప్పి, వినికిడి లోపం, తరచూ జలుబు, ముక్కు దిబ్బడ, గొంతునొప్పి, మింగడంలో ఇబ్బంది, తలనొప్పి, సైనసైటిస్, చెవిలో మోగుడు శబ్దం, ముక్కు నుంచి రక్తస్రావం తదితర సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స, సూచనలు అందించనున్నారు. శిబిరంలో ఉచిత ఓపీ, అంతర్గత పరిశీలన పరీక్షలు, వినికిడి పరీక్షలు నిర్వహించనున్నారు. థైరాయిడ్, రక్త పరీక్షల పై 50 శాతం రాయితీ కల్పించనున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఈఎన్‌టీ శస్త్రచికిత్సకు సంబంధించిన వైద్య సలహాలుఅందించనున్నట్లు పేర్కొన్నారు.

**ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య సేవలు**

కొత్తపేట క్రాస్‌రోడ్, ఆరెపల్లి, వరంగల్‌లోని అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్‌లో ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరం నిర్వహించనున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఈఎన్‌టీ సమస్యలకు సకాలంలో వైద్య సలహాలు, చికిత్స పొందాలని ఆసుపత్రి యాజమాన్యం కోరింది. ముందస్తు అపాయింట్‌మెంట్, ఇతర వివరాల కోసం 9459875555 నంబర్‌లో సంప్రదించాలని సూచించింది.




# తెలంగాణలో దంచికొడుతున్న వానలు.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

ప్రజాదర్బార్ సెప్టెంబర్ 13:

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. రానున్న రెండ్రోజులు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వాతావరణ శాఖ అంచనా ప్రకారం.. ఆదివారం ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. సోమవారం కూడా ఆదిలాబాద్, ఆసిఫాబాద్‌తో పాటు నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో వర్షాలు పడతాయని తెలిపింది. ఈ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనలో అత్యధికంగా 9.35 సెం.మీ., ఖమ్మం జిల్లా కారేపల్లిలో 6.5 సెం.మీ. వర్షం కురిసింది.



మంచిర్యాల జిల్లా కన్నెపల్లిలో ఏకంగా 13.55 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు తెలంగాణ అభివృద్ధి ప్రణాళిక సంస్థ (టీజీడీపీఎస్) గణాంకాలు వెల్లడించాయి. ఈ వర్షాల కారణంగా ఉత్తర తెలంగాణలోని ప్రాజెక్టులకు వరద నీరు వచ్చి చేరుతోంది. ఆసిఫాబాద్ జిల్లాలోని వట్టివాగు, కుమరం భీం ప్రాజెక్టుల్లోకి 2,172 క్యూసెక్కుల వరద వస్తుండగా, అధికారులు 1,378 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో రైతులు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# కేసీఆర్ గారిని దగ్గరి నుంచి చూడాలని నా కోరిక బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు!

ప్రజాదర్బార్ సెప్టెంబర్ 13:



ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు గారి ఆధ్యాత్మిక ప్రవచనాలకు తెలుగు రాష్ట్రాల్లో విశేష ఆదరణ ఉంది. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడిన కొన్ని విశేషాలు మరియు అప్పట్లో జరిగిన ఒక ప్రత్యేక సంఘటనకు సంబంధించిన వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. భారతీయ సనాతన ధర్మాన్ని, మానవ విలువలను తన ప్రవచనాల ద్వారా సమాజానికి చాటుతున్న చాగంటి కోటేశ్వర రావు గారిని గతంలో నిర్వహించిన భాగవత సప్తాహ వేడుకల్లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ఘనంగా సన్మరించారు. ఆ సందర్భంగా కేసీఆర్ దంపతులు ఆయనను సాదరంగా ఆహ్వానించి, పాదాలకు నమస్కరించి తమ గౌరవాన్ని చాటుకున్నారు. ఆ వేదికపై కేసీఆర్ గారు మాట్లాడుతూ చాగంటి వారిని మానవ జాతికి దొరికిన అపురూపమైన వ్యక్తిగా కొనియాడారు. భగవద్గీత, భాగవతం వంటి పవిత్ర గ్రంథాల సారాన్ని సామాన్యులకు కూడా అర్థమయ్యే రీతిలో అందించడంలో ఆయన చేస్తున్న కృషి ఎంతో గొప్పదని పలువురు ప్రశంసించారు. ఆధ్యాత్మికతను, సంస్కృతిని ప్రోత్సహిస్తూ ప్రముఖుల మధ్య ఉన్న పరస్పర గౌరవాన్ని చాటిచెప్పే ఈ జ్ఞాపకం ప్రస్తుతం అందరినీ ఆకట్టుకుంటోంది.